## పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి


కలెక్టర్ విపి గౌతమ్

2 లో

ప్రజాపక్షం
PRAJAPAKSHAM
స్తంభాద్రి భద్రాద్రి
శుక్రవారం | 22 | మార్చి | 2024
పేజీలు 7

# మైనర్ ప్రేమలు..!





**-అబ్బాయికి 16.. అమ్మాయికి 15**
**-గర్భం దాల్చిన బాలిక**

కాలం మారుతుంది. జీవితంపైన కనీస అవగాహన లేకుండానే శారీరక సంబంధాల వైపు మైనర్లు పరుగులు పెడుతున్నారు. మారిన సామాజిక పరిస్థితులు, సామాజిక మాధ్యమాలు, సెల్‌ఫోన్ ద్వారా దిగుమతి అయిన కొత్త సంస్కృతి ఈ సంబంధాల వైపు ఉసిగోల్పేలా చేస్తుంది. కనీస అవగాహన లేకుండానే ఆకర్షితులవుతున్నారు. అది తల్లిదండ్రులకు గుదిబండలా మారడమే కాకుండా విలువైన జీవితాలు వికసించక ముందే మొగ్గల్లా వాడిపోతున్నాయి. అబ్బాయికి 16 సంవత్సరాలు, అమ్మాయికి 15 సంవత్సరాలు వారిరువురి మధ్య శారీరక సంబంధం వెరసి ఆ బాలిక గర్భవతి. ఆలోచించడానికే ఆందోళన కలిగించేలా ఉన్న ఈ విషయం వాస్తవం.

-ప్రజాపక్షం/ఖమ్మం

2 లో

## రైస్ మిల్లర్లపై
# విజిలెన్స్ నజర్..!



- వ్యవహారాలపై కూపీ లాగుతున్న విజిలెన్స్ అధికారులు
- అనుమతులు లేకుండా లీజుకు నడుస్తున్న మిల్లులు
- ప్రభుత్వాదాయానికి కోట్లలో గండి
- విజిలెన్స్‌కు తప్పుడు సమాచారం

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : జిల్లాలోని రైస్ మిల్లుల వ్యవహారాలపై విజిలెన్స్ అధికారులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. కొంతమంది ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే రైస్ మిల్లులను లీజుకు నడిపిస్తున్నట్లు సమాచారం అందుకున్న విజిలెన్స్ అధికారులు గుట్టుచప్పుడు కాకుండా ఆరా తీస్తున్నారు. వారి ఆరాలో నిజమని తేలితే చర్యలు తీసుకునేందుకు సిద్ధపడుతున్నారు.

**జిల్లాలో 37 మిల్లులు ...**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 37 రైస్ మిల్లులున్నాయి. కొనుగోలు చేసిన ధాన్యాన్ని రెండు సీజన్లలో కేటాయిస్తుంటారు. నిబంధనల ప్రకారం ఎఫ్‌సిఐకి ధాన్యాన్ని లెవీ క్రింద అందిస్తుంటారు. ఈ కేటాయింపులు పౌరసరఫరాల శాఖ ఆదీనంలో నడుస్తుంటాయి. జిల్లాలో కొందరు రైస్ మిల్లర్లు

మిగతా 2లో..

## అడుగంటిన
# భూగర్భజలాలు..!



6 లో

- -జలకళ తప్పిన చెరువులు, బావులు, బోర్లు
- -ఎండుతున్న యాసంగి వరి పొలాలు
- - మంచినీటి ఎద్దడి ఏర్పడే ప్రమాదం

గత కొన్ని సంవత్సరాలుగా తిరుమలాయపాలెం మండలంలో తాగు.. సాగునీరు భక్త రామదాసు ఎత్తిపోతల ద్వారా డోకా లేకుండా పుష్కలంగా ఉండేవి. కానీ ఈ సంవత్సరం నాగార్జునసాగర్‌లో అనుకున్న స్థాయిలో నీటిమట్టం లేకపోవడంతో ఉన్నకాస్త నీటిని ఆంధ్రప్రాంతానికి తరలించడంతో ఖమ్మం జిల్లాలో సాగునీరు, తాగునీటికి కష్టాలు ఎదురవుతున్నాయి.

-ప్రజాపక్షం/తిరుమలాయపాలెం

# మైనర్ ప్రేమలు..!

ప్రజాపక్షం/ ఖమ్మం : కాలం మారుతుంది. జీవితంపైన కనీస అవగాహన లేకుండానే శారీరక సంబంధాల వైపు మైనర్లు పరుగులు పెడుతున్నారు. మారిన సామాజిక పరిస్థితులు, సామాజిక మాధ్యమాలు, సెల్ ఫోన్ ద్వారా దిగుమతి అయిన కొత్త సంస్కృతి ఈ సంబంధాల వైపు ఉసిగొల్పేలా చేస్తుంది. కనీస అవగాహన లేకుండానే ఆకర్షితులవుతున్నారు. అది తల్లిదండ్రులకు గుదిబండలా మారడమే కాకుండా విలువైన జీవితాలు వికసించక ముందే మొగ్గల్లా వాడిపోతున్నాయి. అబ్బాయికి 16 సంవత్సరాలు, అమ్మాయికి 15 సంవత్సరాలు వారిరువురి మధ్య శారీరక సంబంధం వెరసి ఆ బాలిక గర్భవతి. ఆలోచించడానికే ఆందోళన కలిగించేలా ఉన్న ఈ విషయం వాస్తవం. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఓ ఉన్నత పాఠశాలలో వెలుగు చూసింది ఈ ఘటన. ఈ ఘటనతో సమాజం ఒక్కసారి ఉలిక్కిపడింది. ఇది ఈ ఒక్క పాఠశాలకో, గ్రామానికో పరిమితం కాలేదు. వెలుగు చూడని అనేక పాఠశాలల్లో ఈ మైనర్ జంటలు ఉన్నాయి. ఇప్పుడు దీనిని ఆపడం ఎలా. ఈ టీనేజీ ప్రేమలకు చెక్ పెట్టేదెలా అన్న ఆలోచన మొదలైంది. రెండు రోజుల క్రితం ఈ ఘటన వెలుగు చూసినప్పుడు అందరూ ఆశ్చర్యపోయారు. మండల కేంద్రంలోని ఓ ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ ఘటన నిజం కాకపోతే బాగుండుననిపించింది. కానీ నిజమేనని తెలిసి అవగాహన ఉన్న ప్రతి ఒక్కరు ఈ ప్రమాదం నుంచి యువతను మరల్చాలన్న ఆలోచనకు వచ్చారు నిజమే. ఒకప్పుడు సినిమాలు యువతపై ప్రభావం చూపుతున్నాయని తల్లిదండ్రులు సినిమాలకు దూరంగా తమ బిడ్డలను పెంచాలని భావించే వారు. చాలా మంది ఆ విషయంలో కృతకృత్యులయ్యారు. కానీ ఇప్పుడు సెల్‌ఫోన్ నెట్టింట్లోనే చిచ్చుపెట్టింది. మనింట్లో ఉండే ఏమి చూడాలనుకుంటున్నారో అవి చూస్తున్నారు. తద్వారా వారి ఆలోచనలు మారిపోతున్నాయి. కరోనా పుణ్యమా అని ఆన్‌లైన్ పాఠాలు అంటూ పసి ప్రాయంలోనే సెల్ ఫోన్ చూడక తప్పని స్థితి ఏర్పడింది. ఇప్పుడు అది ఒక వ్యసనంగా మారింది. సెల్‌ఫోన్ ఇవ్వలేదని ఆత్మహత్యలు చేసుకున్న వారు సైతం ఉన్నారంటే అతిశయోక్తి కాదు. తెలిసి తెలియని వయస్సులో సెల్‌ఫోన్‌లోని చిత్రాలను డౌన్‌లోడ్ చేసుకుని ఆ సంభాషణలు వింటూ తమ శరీర వాంఛలను అప్పుడే తీర్చుకోవాలని తొందరపడుతున్నారు. వాట్సాఫ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్ తదితరమైన యాప్‌లు వీరి పాలిట శాపాలుగా మారాయి. ఆ క్రమంలోనే వారిద్దరి మధ్య ఏర్పడిన శారీరక సంబంధం ఆ బాలికను దోషిగా నిలబెట్టి తల్లిదండ్రులను తలవంచుకునేలా చేసింది. తమ ఇంట్లో కూడా ఇలాంటిదే జరుగుతుందని తెలుసుకోలేని చాలా మంది ఆ బాలిక తల్లిదండ్రులను వేలేత్తి చూపుతున్నారు. గర్భం దాల్చిందటగా అంటూ చెవులు కోరుకుంటున్నారు. ఇది ఆ కుటుంబానికో, ఆ ఇద్దరికో పరిమితమై పోలేదు. భవిష్యత్ తరాన్ని ఆ యాప్‌లు మింగేస్తున్నాయి. లక్ష్యం లేని గమ్యం వైపు ప్రయాణించేలా చేస్తున్నాయి. తల్లిదండ్రులు సైతం ఫోన్‌లోనే కాలాన్ని వెళ్లదీస్తున్నారు. ఫోన్ చూసుకుంటూనే వంట, ఫోన్ చూసుకుంటూనే పని, ఫోన్ చూసుకుంటూనే పలకరింపులు అంతా ఫోన్‌లోనే ముఖం పెట్టండే ఏమి చేయలేని స్థితి. పిల్లలతో రోజు ఓ గంట పాటు గడపలేని తల్లిదండ్రులు ఉన్నారంటే ఆశ్చర్యం కలుగమానదు. మన పిల్లలకు బాక్స్ కట్టడం, బడికి పంపడం, ఫీజులు కట్టడం, ఖర్చులకు డబ్బులు ఇవ్వడమే కాదు ఇంకా మనమివ్వాల్సింది చాలా ఉందన్న విషయాన్ని తల్లిదండ్రులు గ్రహించలేకపోవడమే ఈ పరిస్థితి కారణమవుతుంది. కౌమార్య దశలోనే పరిస్థితి ఈవిధంగా ఉంటే ముందుందు ఎలా ఉంటుందోనన్న ఆందోళన, భవిష్యత్ యువత ఈ సమాజాన్ని ఏవైపుకు తీసుకుపోతుందోనన్న భయం చాలా మందిలో ఉంది. సెల్‌ఫోన్ ప్రపంచాన్ని నడిపిస్తుంది, సమాచారాన్ని అందిస్తుంది. అదే సమయంలో జీవితాన్ని శాసిస్తుంది. ఆ సెల్ ఫోన్ జీవితం నుంచి తమ పిల్లలను బయటకు తీసుకు రావాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంది. లేదంటే ఇప్పుడు పదో తరగతి బాలికకు గర్భం అన్న మాటను విన్నాం ఇక ముందుందు ఏమి వినాల్సి వస్తుందో.

# రైస్ మిల్లర్లపై విజిలెన్స్ నజర్..!

(మొదటిపేజీ తరువాయి)

నడిపించలేని పరిస్థితుల్లో ఇంతరులకు లీజు పేరిట అప్పగిస్తున్నారు. ఇలా లీజుకు ఇచ్చిన మిల్లులు సుమారు 15 నుండి 20 వరకు ఉండవచ్చని తెలుస్తోంది.

**అనుమతులు లేకుండానే లీజులు ...**

జిల్లా వ్యాప్తంగా ఉన్న 37 రైస్ మిల్లుల్లో సుమారు 15 నుండి 20 వరకు లీజుకు నడుస్తున్నట్లు తెలుస్తోంది. లీజుకు తీసుకున్న వారు ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే రైస్ మిల్లులు నడిపిస్తున్నట్లు తెలుస్తోంది. సదరు లీజు వ్యాపారులు మిల్లర్ల పేరుమీదే ధాన్యాన్ని తీసుకుంటూ ఆడించి ఎఫ్‌సిఐకి పంపుతున్నారు. వాస్తవానికి రైస్ మిల్లులు లీజుకు తీసుకున్న ప్రాసెసింగ్ లైసెన్స్‌తో పాటు ప్రర్చేస్ లైసెన్సులు తీసుకోవాల్సి ఉంటుంది. లీజుకు తీసుకున్న వారిలో గత కొంత కాలంగా ఎలాంటి లైసెన్సులు తీసుకోకుండానే పనికానిచ్చేస్తున్నారు. నిబంధనల ప్రకారం లైసెన్సు తీసుకోవడంతో పాటు ఫీజులు చెల్లించాలి. కానీ జిలాల్లో నిబంధనలకు వ్యతిరేకంగా కొన్నేళ్లుగా మిల్లులు నడుస్తుండటంతో మార్కెటింగ్ శాఖకు రావాల్సిన కోట్లాది రూపాయాల ఆదాయానికి గండిపడుతోంది. సంబంధిత శాఖకు సంబంధించి మార్కెట్ కమిటీ పరిధిలో లీజుకు తీసుకున్న వారు. తప్పని సరిగా అనుమతులు తీసుకోవాలి. ప్రాసెసింగ్ క్రింది లీజుకు తీసుకుని నడిపే వారు. రూ.1లక్ష లైసెన్సు ఫీజు తప్పని సరిగా చెల్లించి మూడేళ్ల అనుమతి పొందాలి. మరో ప్రక్క పర్చేస్ లైసెన్సు క్రింద రూ.3 లక్షలు చెల్లించాలి. ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే యజమానుల పేరుతో లీజుదారులు నడిపిస్తున్నట్లు తెలుస్తోంది.

**విజిలెన్స్‌కు తప్పుడు సమాచారం ...**

రైస్ మిల్లుల లీజు వ్యవహారాల్లో మార్కెటింగ్ శాఖ విజిలెన్స్ అధికారులకు తప్పుడు సమాచారాన్ని చేరవేస్తున్నట్లు తెలుస్తోంది. అతా సవ్యంగానే ఉన్నాయని నివేదికలు సమర్పిస్తున్నట్లు సమాచారం. మరో ప్రక్క లీజులు తీసుకున్నప్పటికీ ఎక్కడా బయటకు పొక్కకుండా మిల్లు యజమానులు, లీజుదారులు జాగ్రత్త పడుతున్నట్లు తెలుస్తోంది.



జిల్లా వ్యాప్తంగా ఉన్న సుమారు 15 నుండి 20 మిల్లులు ఎలాంటి లీజు అనుమతులు లేకుండా నడుస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు నోరు మెదపక పోవడం గమనార్హం అని పలువురు ఆరోపిస్తున్నారు. ఇటు మిల్లర్లు, అటు లీజు దారుల నుండి ఒక్కొక్క మిల్లు నుండి భారీగా ముడుపులు తీసుకుని లీజులే లేవంటూ సంబంధిత మార్కెటింగ్ శాఖాధికారులు చెప్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ఇదే సమాచారాన్ని మీడియా అడిగినప్పటికీ అంతా సవ్యంగానే ఉన్నాయంటూ దాటవేస్తున్నారు. విజిలెన్స్ అధికారులు మార్కెటింగ్ శాఖ ఇచ్చే వివరాలతోనే సరిపెట్టుకోకుండా క్షేత్రస్థాయిలో ఆరా తీస్తే పలువురి భాగోతాలు బయటకు వస్తాయని, దీంతో ప్రభుత్వానికి ఆదాయం సమకూరే అవకాశం ఉందని పలువురు అంటున్నారు.

## పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఓటర్లకు, పోలింగ్ సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పోలింగ్ కేంద్రాల్లో అన్ని మౌలిక వసతుల కల్పన చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విపి గౌతమ్ తెలిపారు. గురువారం కలెక్టర్ విపి గౌతమ్ ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలోని కస్బాబజార్, సుందరయ్య నగర్, ఖాజీపుర, శాంతినగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను సందర్శించి పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలలో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు తదితర అన్ని మౌలిక సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరా లేని చోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు అవసరం ఉన్న చోట రంగులు వేయాలని, మరుగుదొడ్లలో రన్నింగ్ వాటర్ ఉండాలన్నారు. ఫ్యాన్లు, లైట్లు సరిపోను ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. భద్రతాపరంగా చర్యలు తీసుకోవాలని, కాంపౌండ్ వాల్ లేని పోలింగ్ కేంద్రాలకు కాంపౌండ్ వాల్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఒకే లోకేషన్‌లో ఒకటి కంటే పోలింగ్ కేంద్రాల ఏర్పాటు ఉన్న చోట క్యూ, రద్దీ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. స్వీప్ కార్యచరణలో భాగంగా కాంపౌండ్ గోడలపై ఓటరు అవగాహనకు సంబంధించి నినాదాలు రాయాలన్నారు. భద్రతాపరంగా అన్ని చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలకు పాఠశాలను చూడగానే ఇక్కడ పోలింగ్ కేంద్రం ఉన్నదనే ప్రత్యేకత కనిపించాలని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఈఈ కృష్ణలాల్, ఎంఈవో శ్రీనివాసరావు, అర్బన్ తహసీల్దార్ సిహెచ్ స్వామి, అధికారులు పాల్గొన్నారు.

## చెక్‌పోస్ట్ వద్ద ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించండి



ప్రజాపక్షం/ ఖమ్మం : కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల తేదిని ప్రకటించినప్పటి నుండి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల నిబంధనలు అమల్లోకి వచ్చాక ఖమ్మం వరంగల్ జాతీయ రహదారిపై తిరుమలాయపాలెం మండల పరిధిలోని సుబ్లేడు క్రాస్ రోడ్డు వద్ద చెక్‌పోస్ట్ లో ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని ఖమ్మం రూరల్ ఏసిపి తిరుపతిరెడ్డి స్థానిక పోలీస్ అధికారులను ఆదేశించారు. ఖమ్మంజిల్లా తిరుమలాయపాలెం మండలం వరంగల్, మహబూబాబాద్, నల్గొండ అంతర్ జిల్లాలు అతి దగ్గరగా ఉండటంతో అంతర్ జిల్లాలు దాటి ఖమ్మంజిల్లాకు ప్రతి ఒక్క వాహనం చేరుకుంటుందని వాటి ద్వారా రహస్యంగా అక్రమ నగదు, మద్యంతో పాటు ఓటర్లను ప్రలోభపెట్టేందుకు పలు వస్తువులను ఎక్కువ మొత్తంలో తరలించేందుకు వీలు ఉంటుందని, ఎలాంటి బిల్లులు లేకుండా రశీదులు లేకుండా వాహనాల్లో నగదుతో పాటు వస్తువులను తరలిస్తే వాహనాలను సీజ్ చేయాలని ప్రతి ఒక్క వాహనదారుడు ఎన్నికల నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏసిపి తిరుపతిరెడ్డి, తిరుమలాయపాలెం ఎస్ఐ గిరిధర్ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


## విద్యార్థినుల పట్ల ఉపాధ్యాయుని అసభ్య ప్రవర్తన

-ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వైనం -బోడులో ఘటన

ప్రజాపక్షం/ఖమ్మం/టేకులపల్లి : విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న ఓ కీచక ఉపాధ్యాయుని ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ప్రింది మండలంలోని బోడు ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయునిగా పని చేస్తున్న వ్యక్తి విద్యార్థినిలపై చెప్పరాని చోట్ల చేతులు వేస్తూ అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని తల్లిదండ్రులు ప్రధానోపాధ్యాయునికి ఫిర్యాదు చేశారు. ప్రధానోపాధ్యాయునితో పాటు మండల విద్యాశాఖాధికారులకు సైతం తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. అయితే ఇట్టి ఫిర్యాదు విషయాన్ని అత్యంత గోప్యంగా ఉంచారు. తల్లిదండ్రులు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించడంతో ఘటన వెలుగు చూసింది. పూర్తి విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని విద్యాశాఖాధికారులు తెలిపినట్లు సమాచారం.

# ప్రజలకు ఇబ్బందులు లేకుండా వైద్య సేవలు అందించాలి

**-ప్రైవేటు ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలను పెంచాలి**
**-కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు రవీందర్ నాయక్**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వైద్య ఆరోగ్య సేవలను అందించాలని రాష్ట్ర ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు డాక్టర్ రవీందర్ నాయక్ తెలిపారు. గురువారం ప్రజా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు రవీందర్ నాయక్ ఖమ్మంజిల్లాలో పర్యటించారు. తొలుత కూసుమంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ప్రజలకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఏవిధమైన ఇబ్బందులు కలుగకుండా వైద్య ఆరోగ్య సేవలను అదించాలని ఆదేశించారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయాన్ని సందర్శించారు. ప్రోగ్రాం అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో అమలవుతున్న ఆరోగ్య కార్యక్రమాలు, మాతా శిశు సంక్షేమం, ఇమ్యూనైజేషన్ కార్యక్రమం, జాతీయ ఆరోగ్య మిషన్, జాతీయ కీటక జనిత రోగ నివారణ, జాతీయ కుష్టు నివారణ, అసంక్రమణ వ్యాధుల నివారణ మొదలైన కార్యక్రమాలపై సమీక్ష చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రోగ్రాం అధికారులు కార్యక్రమ అమలులో నిబద్ధత పాటించాలన్నారు. అప్పుడే ప్రజలకు అవసరమైన వైద్య సేవలు అందుతాయని ఆయన తెలిపారు. జిల్లాలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులో అధికారులు చొరవ చూపి అమలైన కార్యక్రమాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేసి జిల్లాను రాష్ట్రంలోనే నెంబర్‌వన్‌గా ఉంచాలన్నారు. ప్రైవేటు ఆసుపత్రులలో సి సెక్షన్ ఆపరేషన్స్ తగ్గించి సాధారణ ప్రసవాలు పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ సైదులు, డాక్టర్ సీతారాం, డిఐవో డాక్టర్ ప్రమీల, డాక్టర్ చందునాయక్, డిఎల్‌వో డాక్టర్ లక్ష్మినారాయణ, డాక్టర్ భాస్కర్ నాయక్, డెమో కాశీనాథ్, ఎన్‌హెచ్‌ఎం డిపివో నీలోహన, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖమ్మంజిల్లా పర్యటనకు వచ్చిన సంచాలకులు డాక్టర్ రవీందర్ నాయక్‌కు డిఎంఅండ్‌హెచ్‌వో మాలతి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

# పౌష్టికాహారంపై అవగాహన



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మండల కేంద్రమైన రఘునాథపాలెం అంగన్‌వాడీ కేంద్రం 4 నందు పౌష్టికాహారం, వ్యాక్సినేషన్ పై అవగాహన కల్పించారు. పోషన్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా గురువారం అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో సూపర్ వైజర్ కృష్ణకుమారి పాల్గొని పౌష్టికాహారం గురించి, వ్యాక్సినేషన్ గురించి గర్భిణీలు, బాలింతలకు వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం పౌష్టికాహారాన్ని అందిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రానికి తల్లిదండ్రులు కుర్చీలు, చాపలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ ఎన్. ఉపవాణి, మమత మెడికల్ కళాశాల వైద్య విద్యార్థులు, ఆయా పూర్ణిమ, గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి : సిపి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ట్రైనీ కానిస్టేబుళ్లు వృత్తి నైపుణ్యాన్ని మరింత పెంపొందించుకునేందుకు తొమ్మిది నెలల శిక్షణ చాలా కీలకమైందని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. గురువారం పోలీస్ శిక్షణా కేంద్రాన్ని సిపి సునీల్ దత్ సందర్శించారు. శిక్షణలో భాగంగా ఫైరింగ్ రేంజ్ నందు సిబ్బందికి ఇస్తున్న ఫైరింగ్ ప్రాక్టీస్ శిక్షణను సిపి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ ప్రజల ఉజ్వల భవిష్యత్తుకు మీరంతా దీర్ఘకాలం పాటు సగర్వంగా అందించబోయే సేవలకు శిక్షణ చాలా కీలకమైందని తెలిపారు. ఇందు కోసం కావాల్సిన శక్తి సామర్థ్యాలను, నిబద్ధతను శిక్షణలో నేర్పిస్తారని ఆయన తెలిపారు. మీ లక్ష్యాలను నెరవేర్చుకోవడానికి అంకిత భావంతో ముందుకెళ్తూ పోలీస్ శాఖకు పేరు ప్రఖ్యాతలను తీసుకు వస్తారని విశ్వసిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపి గణేష్, ఏసిపి రవి, ఏఆర్ ఏసిపి నర్సయ్య, ఆర్‌ఐలు తిరుపతి, అప్పల నాయుడు, నాగులమీరా తదితరులు పాల్గొన్నారు.



# దుమ్ము ధూళి నుంచి ప్రజలకు మోక్షం

**-రహదారికి బిటి రోడ్డు నిర్మాణం**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఎన్నో ఏళ్లుగా దుమ్ము, ధూళి నుంచి ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. అట్టి రహదారికి బిటి రోడ్డు నిర్మాణం చేపట్టారు. రఘునాథపాలెం వద్ద 30 ఏళ్లుగా కంకర్ మిల్లుకు వెళ్లే రోడ్డు వాహనాల రద్దీతో ప్రజలు దుమ్ము, ధూళితో నిత్యం ఇబ్బందులు పడేవారు. పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు మందా బుచ్చిబాబు ప్రజల ఇబ్బందులను గుర్తించి సమస్య పరిష్కారం కోసం తన వంతు కృషి చేశాడు. రహదారిపై వాహనాలు రాకపోకలు సాగించకుండా అడ్డుకున్నారు. దీంతో స్పందించిన కంకర మిల్లు యజమాన్యం ప్రజలకు ఇబ్బందులు లేకుండా దుమ్ము, ధూళి రాకుండా బిటి రోడ్డు నిర్మాణం చేపట్టారు. గ్రామంలో సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్న మందా బుచ్చిబాబును గ్రామస్తులు అభినందించారు.

# కూలీల హాజరు శాతాన్ని పెంచాలి

**ఉపాధి పనులను పరిశీలించిన అడిషనల్ డిఆర్‌డివో**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఉపాధి పనుల్లో కూలీల హాజరు శాతాన్ని పెంచాలని అడిషనల్ డిఆర్‌డివో శిరీష తెలిపారు. గురువారం మండల కేంద్రమైన రఘునాథపాలెం గ్రామంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా ఫీడర్ కాలువ పూడికతీత పనులను అడిషనల్ డిఆర్‌డివో శిరీష పరిశీలించారు. మస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడారు. ఉపాధి హామీ పనులకు సంబంధించి కూలీల హాజరు శాతాన్ని పెంచాలని తెలిపారు. వేసవికాలం దృష్ట్యా ఉపాధి పనుల వద్ద అవసరమైన రక్షణా చర్యలు చేపట్టాలని ఆమె తెలిపారు. కూలీలకు నీడ ఏర్పాటుతో పాటు తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. అనంతరం గ్రామ పంచాయితీలోని హరితహారం నర్సరీని ఆమె పరిశీలించారు. నర్సరీలలో మొక్కలు ఎండిపోకుండా నిరంతరం నీటిని అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపివో పద్మయ్యనాయుడు, టెక్నికల్ అసిస్టెంట్ మదన్, ఫీల్డ్ అసిస్టెంట్ సూర్యం తదితరులు పాల్గొన్నారు.

# హెల్మెట్ వాడకంపై ట్రాఫిక్ పోలీసులు అవగాహన



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడంతో రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతున్నారని ట్రాఫిక్ సిఐ మోహన్‌బాబు తెలిపారు. ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాసులు పర్యవేక్షణలో గురువారం ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో జెడ్పి సెంటర్ వద్ద వాహనదారులకు హెల్మెట్ వాడకం వల్ల కలిగే ప్రయోజనాల పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ మోహన్‌బాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించి తమ విలువైన ప్రాణాలను కాపాడుకోవాలని తెలిపారు. హెల్మెట్ ధరించి వాహనాలు నడపడం వల్ల ఒక రక్షణ కవచంలా ప్రమాదాలు జరిగినప్పుడు ఉపయోగపడుతుందన్నారు. నెంబర్ ప్లేట్లు లేకుండా రోడ్లపై తిరుగుతున్న ఆరు ద్విచక్ర వాహనాలపై ఖమ్మం వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. నెంబరు ప్లేట్లు లేకుండా తిరిగే వాహనాలు, ర్యాష్ డ్రైవింగ్,హెల్మెట్ ధరించని వాహనాలపై ప్రత్యేక దృష్టిసారించి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ రవి, వెంకన్న, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# అడవులను నాశనం చేస్తే ఉనికికే ప్రమాదం

**ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ తేజస్విని**




**ప్రజాపక్షం/పినపాక:** అడవులను ప్రజలు తమ స్వలాభం కోసం నాశనం చేస్తే మన ఉనికిని మనమే ప్రశ్నార్థకం చేసుకున్నవారమవుతామని పినపాక ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ తేజస్విని అవగాహన కల్పించారు. గురువారం ప్రపంచ అటవీ దినోత్సవ సందర్భంగా అడవి శాఖ కార్యాలయం నుండి ఈ బయ్యారం వరకు సిబ్బందితో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్ తరాలు ఆరోగ్యంగా ఉండాలంటే అడవులను వారసత్వంగా వారికి అందించాల్సిన ఆవశ్యకత మన పైన ఉన్నదన్నారు. తగ్గిపోతున్న అడవులను కాపాడే ఉద్దేశంతో ఐక్యరాజ్య సమితి మార్చి 21న ప్రపంచ అటవీ దినోత్సవంగా ప్రకటించిందన్నారు. సకాలంలో వర్షాలు పడాలన్నా, వాతావరణంలో కాలుష్యం ఏర్పడకుండా వుండాలన్నా వాతావరణ సమతుల్యత కాపాడుకోవాలంటే అడవులే కీలకం అని పిలుపునిచ్చారు. అడవులతోనే మానవుల మనుగడ అని అందరికి తెలిసినా అడవుల రక్షణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పర్యావరణ సమస్యలు ఉత్పనమవుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరు విధిగా ఇంటి ముందు సైతం రెండు మొక్కలు నాటాలని, నాటడమే గాక సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ అరుణ, అటవి శాఖ అధికారులు పాల్గొన్నారు.

## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి




**ప్రజాపక్షం/కొణిజర్ల :** గ్రామంలోని ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని , కాచి చల్లార్చిన గోరువెచ్చని నీరుతాగాలని కొణిజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కె రాధాకృష్ణ అన్నారు. మండల పరిదిలోని గుబ్బగుర్తి పంచాయతీ పరిదిలోని ఎల్లన్ననగర్‌లో గురువారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలోని 15 మంది జ్వరపీడుతలకు చికిత్స చేశారు. 51 మందికి రక్త నమూనాలు సేకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు వ్యాధులు ప్రబలడానికి ఎక్కువ శాతం కలుషిత నీరు అని అన్నారు. నీటితోపాటు పరిసరాల పరిశుభ్రత , వ్యక్తిగత పరిశుభ్రత కూడా అవసరం అని అన్నారు. ఒళ్ళ నొప్పులు , తల తిరగడం లాంటి జ్వరానికి సంబందించిన లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు. కొణిజర్ల ఆరోగ్య కేంద్రానికి వచ్చి డాక్టర్లు ఇచ్చిన సూచనలు పాటించి జ్వరాల బారిన పడకుండా ఉండాలని సూచించారు. ఈకార్యక్రమంలో కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్ డాక్టర్ డి మధుసూధన్‌రావు , డాక్టర్ కె రాజేష్ , తులసి , బి విద్య , నరసింహారావు , రవికుమార్ , సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా సామూహిక సీమంతాలు




**ప్రజాపక్షం/కొణిజర్ల :** మండల పరిదిలోని తనికెళ్ల రైతువేదికలో గురువారం గర్భిణీలకు సామూహిక సీమంతాలు ఘనంగా నిర్వహించారు. 13 మంది గర్భిణీలకు చీరలు , పండ్లు , పూలు , మిఠాయిలు పంపిణీ చేసి ఆశీర్వదించారు. ఐసిడిఎస్ ప్రాజెక్టు ఖమ్మం రూరల్ లెవల్ కార్యక్రమాన్ని తనికెళ్ల రైతువేదిక నందు నిర్వహించారు. ఈ సందర్భంగా కొణిజర్ల ఎంపిడీఓ ఏ రోజారాణి మాట్లాడుతు మంచి పోషక ఆహార పదార్థాలు తీసుకోవడం ద్వారానే గర్భిణీలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని అన్నారు. చిన్నారులకు అన్నప్రాసన , అక్షరాభ్యాసం కార్యక్రమాలు నిర్వహించారు. పోషకాహారం , పరిశుభ్రత , ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈకార్యక్రమంలో సిడిపిఓ సిహెచ్ కమలప్రియ , ఏసిడిపిఓ ఉషారాణి , ఏసిడిపిఓ బి శివమ్మ , తనికెళ్ల పల్లె దవాఖానా డాక్టర్ గీత , హెల్త్ ఆఫీసర్ జాన్సన్ , సూపర్‌వైజర్లు , అంగన్‌వాడి టీచర్స్ పాల్గొన్నారు.

## ఎన్నికల నియమావళిపై సమీక్ష



**ప్రజాపక్షం/ముదిగొండః** సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గురువారం ఖమ్మం ఆర్డీఓ,మధిర సహాయ రిటర్నింగ్ అధికారి జి.గణేష్ మండల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని విధిగా ఎన్నికల నియమావళి పాటించాలి అన్నారు. అదేవిధంగా ఎన్నికల కోడ్ భాగంగా పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రామారావు, ఎంపిడీఓ శ్రీధర్‌స్వామి, ఎస్ఐ గజ్జెల నరేష్, ఎంపిఓ సూర్యనారాయణ, వ్యవసాయ అధికారి రాజా, నీటిపారుదలశాఖ డీఈ పెద్ద రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## దుప్పటి భద్రమ్మ కుటుంబానికి రేగా పరామర్శ



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** మండల పరిధిలోని నాగినేని ప్రోలురెడ్డిపాలెం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు దుప్పటి రమణ అమ్మ భద్రమ్మ ఇటీవల కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మరణించారు. కాగా గురువారం దశ దిన కర్మలకు రాష్ట్ర మాజీ ప్రభుత్వ విప్, మాజీ శాసన సభ్యులు, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు హాజరై మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, అండగా ఉంటామని ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. ఈకార్యక్రమంలో జెడ్పిటిసి కామిరెడ్డి శ్రీలత, సొసైటీ ఛైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు గోపిరెడ్డి రమణారెడ్డి, సారపాక టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బాలి శ్రీహరి, మాజీ ఎంపిటిసి వసంత, నాయకులు యారం వెంకటరెడ్డి, యక్కంటి నరేష్‌రెడ్డి, సానికొమ్ము రామచంద్రారెడ్డి, పలువురు కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా 'హ్యాపీకిడ్స్' 8వ వార్షికోత్సవం






**- అబ్బురపరిచిన చిన్నారుల కాంతార నృత్యం,కరాటేస్టంట్స్**

**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** ఖమ్మం రూరల్ మండలంలోని వరంగల్‌క్రాస్‌రోడ్డులో గల హ్యాపీకిడ్స్ స్కూల్ 8వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం రాత్రి అట్టహాసంగా జరిగాయి. దీనికి ముఖ్య అతిథులుగా హాజరైన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయ ఇంఛార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి,సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఇందులో భాగంగా నిర్వహించిన కల్చరల్ ప్రోగ్రామ్స్ ఆకట్టుకున్నాయి. చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆహుతులను కట్టిపడేసాయి. ఈ సందర్భంగా డాన్స్ మాస్టర్ వెంకట్ ఆధ్వర్యంలో చిన్నారులు చేసిన కాంతార స్క్రిప్ట్ అబ్బురపరిచింది. అదేవిధంగా చిన్నారులతో చేపించిన కారాటే స్టంట్స్ ఉద్వేగభరితంగా కొనసాగాయి. వేడుకలను పురస్కరించుకుని ప్రత్యేక స్టేజి, ప్రదర్శనలను వీక్షించేందుకు 2స్క్రీన్లను సైతం ఏర్పాటు చేశారు. తమ చిన్నారులతో పోటోలే దిగేందుకు ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం చిన్నారులకు మెమొంటాలను స్కూల్ ఆధ్వర్యంలో బహుకరించారు. ఈ కార్యక్రమంలో జీఓ ఐటిహబ్ సీఈఓ బత్తినేని ప్రకాష్, పారిశ్రామికవేత్త భీమవరను పుల్లారావు, సిపిఐ నాయకులు చెరుకుపల్లి భాస్కర్, ఓరుగంటి శేషగిరి, దండి రంగారావు, వెంపటి సురేందర్, యువజన సంఘం నాయకులు వెంపటి రాము, రెబ్బగొండ్ల గోపి, కాంగ్రెస్ నాయకులు వెంపటి రవి, భూక్య సురేష్‌నాయక్, ఎన్‌పి చారి, మేనేజ్‌మెంట్ అండ్ ప్రిన్సిపాల్ ఉమాప్రదీప్‌రెడ్డి, కరస్పాండెంట్ దుర్గాప్రభాకర్, టీచర్లు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ప్రాంగాణ నియామకాల్లో ప్రియదర్శిని ప్రతిభ



**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** ఖమ్మం రూరల్ మండలంలోని పెద్దతండాపంచాయతీపరిధిలో గల ప్రియదర్శిని మహిళల సాంకేతిక కళాశాలకు చెందిన విద్యార్థినిలు ప్రాంగాణనియామకలలో గురువారం ప్రతిభ చూపారు. హైదరాబాద్‌కు చెందిన స్కిల్ దునియా సంస్థ నిర్వహించిన ఇంటర్వ్యూలలో 74మంది బిజెనెస్ డెవలప్‌మెంట్‌లో రూ.6లక్షల వార్షిక వేతనంతో ఎంపికయ్యారు. మొత్తం 183మంది విద్యార్థినిలకుగాను 74మందిలో (సిఎస్సి42),(సిఎస్ఎం13),(ఈసీఈ16),(ఈఈఈ3) నియామకాలు లభించాయి. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ కాటేపల్లి నవీన్‌బాబు మాట్లాడారు...తమ కళాశాలలో చదువుతున్న విద్యార్థినిలకు నాణ్యమైన విద్యను అందిస్తూ ప్రాంగాణనియామకాలను చూపిస్తున్నట్టు తెలిపారు. ఉద్యోగాల కోసం అనేక కంపెనీలతో ఒప్పందాలను కుదుర్చుకుని తల్లిదండ్రులు విద్యార్థినిల పట్ల కన్న కళలను సాకారం చేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం విద్యార్థినిలను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.గోపాల్, కళాశాల అకాడమిక్ డైరెక్టర్ అట్లూరి వెంకరమణ, వివిధ విభాగాల అధిపతులు, ట్రైనింగ్అండ్‌ప్లేస్‌మెంట్ ఆఫీసర్,అధ్యాపకులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

# ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా ఇసుక విక్రయాలు



**-సోంపల్లి గ్రామాలలో రీచ్ ప్రారంభం**
**- బూర్గంపాడు తహసీల్థార్ ముజాహీద్ద్**

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** ఇసుక వాహనం ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా ఇసుక విక్రయాలు నిర్వహించనున్నట్లు బూర్గంపాడు మండల తహసీల్ధార్ ముజాహీద్ద్ అన్నారు. గురువారం మండల పరిధిలోని సోంపల్లి గ్రామంలో మన ఇసుక మన వాహనం ద్వారా ఇసుక ఆన్‌లైన్‌ను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రం ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన ఇసుక పాలసీ విధానం వల్ల ఇసుక ఇక నుంచి చౌర ధరకు ఇసుక లభించనున్నట్లు పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వార ఇసుక విక్రయాలు నిర్వహించేందుకు సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ద్వార ఆధునాతన సాఫ్ట్‌వేర్‌ను రూపొదించినట్లు తెలిపారు. ప్రస్తుతం సోంపలి గ్రామంలో ఇసుక రీచ్ ద్వారా ఇసుక లభ్యమవుతుందని తెలిపారు. మొదటగా సోంపల్లి గ్రామంలో రీచ్‌ను ప్రారంభించడం జరిగిందన్నారు. ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరుగంటల వరకు మాత్రమే ఆయా రీచ్‌లలో ఇసుక రవాణా చేసేందుకు అవకాశం ఉందన్నారు. నిర్దేశించిన సమయంలో కాకుండా ఇతర సమయాలలో ఇసుక రవాణా చేసేందుకు అవకాశం లేదని స్పష్టం చేశారు. ఇసుక రీచ్‌ల వద్ద ప్రభుత్వం నుంచి ఉద్యోగులను ఉంచనున్నట్లు తెలిపారు. శ్యాండ్ టాక్స్ విధానంలో ఎక్కడి నుంచైనా ఇసుక తరలించేందుకు ట్రాక్టర్ యజమానులు రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి మాత్రంమే అవకాశం ఉంటుందని, ఇసుక కావాలని రిజిస్ట్రేషన్ చేయించుకున్న వ్యక్తికి , ట్రాక్టర్ యజమానికి, డ్రైవర్ సెల్‌కు మేసెజ్ చేరడంతో పాటు ఇసుక రవాణా చేసే ట్రాక్టర్ జీపీఆర్ఎస్ విధానాన్ని అనుసంధానం చేయడం ద్వార ఇసుక రవాణ చేసే ట్రాక్టర్ ఎక్కడ ఉందో స్పష్టంగా తెలుసుకునేందుకు విలు ఉంటుందని అన్నారు. ఇసుక రవాణాకు సంబంధించి చెల్లింపులు ఆన్‌లైన్ విధానం ద్వారానే జరుగుతాయని , నేరుగా చెల్లింపులు లేదన్నారు. ఈకార్యక్రమంలో ఆర్ఐ నర్సింహారావు, ఎస్ఆర్‌వో రామ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్వాడ

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** మండల పరిధిలోని ఒడ్డుగూడెం గ్రామంలో గల అంగన్వాడీ కేంద్రంలో పోషణ పక్వాడా కార్యక్రమంలో గురువారం ఐసిడిఎస్ సూపర్వైజర్ సుశీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గర్భిణీలకు శ్రీమంతాలు, చిన్నారులకు అక్షరాభ్యాసం కార్యక్రమాలు నిర్వహించారు. గర్భిణీలు, తల్లులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు లీలావతి, రాజేశ్వరి, రమణ, దీవెనమ్మ, సత్యవతి, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్‌లోకి డా.తెల్లం చేరిక రేపో మాపో..!



**- లైన్ క్లీయర్**
**- మెండుగా పొంగులేటి అండదండలు**



**ప్రజాపక్షం/భద్రాచలం :** భద్రాచలం ఎంఎల్‌ఏ డా.తెల్లం వెంకట్రావు కాంగ్రెస్‌లోకి చేరేందుకు లైన్ క్లియర్ అయినట్లు వార్తలు గుప్పుమంటున్నాయి. ఆయన బిఆర్ఎస్ నుండి గెలిచినప్పటికీ ఈ మధ్య కాలంలో సొంత పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ అధికార కాంగ్రెస్‌తో అంటకాగుతుండటంతో చేరిక లాంఛనమే అంటూ పలువురు చర్చించుకుంటున్నారు. భద్రాచలం ఎమ్మెల్యేగా ఆయన 2018 ఎన్నికల్లో బిఆర్ఎస్ నుండి పోటీ చేశారు. ఆ నాటి ఎన్నికల్లో సిపిఐ పొత్తుతో కాంగ్రెస్ అభ్యర్థి పొదెం వీరయ్య విజయం సాధించారు. 2023లో జరిగిన ఎన్నికల్లో ఈ ఇద్దరి మధ్యే మళ్లీ పోటీ జరిగింది. ఈ సారి కాంగ్రెస్ అభ్యర్థి పొదెం వీరయ్య ఓటమి పాలయ్యారు. పొంగులేటి అనుచరునిగా పేరున్న తెల్లం ఎన్నికలకు కొద్ది రోజుల ముందు వరకు కాంగ్రెస్‌లోనే ఉన్నారు. ఇక్కడి సీటును ఆశించడం, అది సాధ్యపడక పోవడం, అశ్వారావుపేట, ఇల్లెందు, పినపాక సీటైన కాంగ్రెస్ నుండి కేటాయించాలని చేసిన విజ్ఞప్తి తిరస్కరణకు గురికావడంతో మళ్లీ బిఆర్ఎస్ గూటికి చేరారు. భద్రాచలంలో డబ్బులు ఖర్చుపెట్టి గెలిచే సత్తా ఉన్న నాయకుడు ఎవ్వరూ లేకపోవడంతో ఎంఎల్‌సి తాతా మధు, మాజీ మంత్రి పువ్వాడ కృషితో డా.తెల్లంను మళ్లీ పార్టీలోనికి చేర్చుకుని అనూహ్యంగా టెక్కిట్ సైతం కేటాయించారు. ఇంత వరకు బాగానే ఉన్నా... బిఆర్ఎస్‌కు మరో సారి అధికారం గ్యారెంటీ అనుకున్నప్పటికీ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మెజార్టీ సీట్లు సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.

**పొంగులేటి ఆశీస్సులు....**

పొంగులేటి శిష్యునిగా పేరుపడ్డ తెల్లంకు ఆయన ఆశీస్సులు మెండుగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా గత కొద్దిరోజుల క్రితం పొంగులేటితో కలిసి కుటుంబ సమేతంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. దీంతో ఆయనకు లైన్ క్లీయర్ అయిపోయింది. ఇదిలా ఉండగా అప్పట్నుంచి బిఆర్ఎస్ నిర్వహించిన ప్రతీ కార్యక్రమానికి ఆయన దూరంగా ఉన్నారు. ఖమ్మంలో కేటిఆర్, హరీష్ రావు వచ్చి పార్లమెంట్ స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసినప్పటికీ హాజరు కాలేదు. నాలుగు రోజుల క్రితం చర్ల మండల కేంద్రంలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఎంపి అభ్యర్థి కవిత, ఎంఎల్‌సి తాతా మధు, జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు రేగా కాంతారావు కలిసి నిర్వహించిన సమావేశానికి ధుమ్మా కొట్టారు. ఈనెల 11న భద్రాచలం జరిగిన ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో హుషారుగా హాజరైన ఆయన మణుగూరులో జరిగి కాంగ్రెస్ రాజకీయ సభలో సైతం అంతే ఉత్సాహంతో పాల్గొన్నారు.

**రేపో మాపో...**

ఎంఎల్‌ఏ డా.తెల్లం కాంగ్రెస్‌లో చేరిక రేపోమాపో ఉండనుంది. హైదరాబాద్‌లో దానం నాగేంధర్ కాంగ్రెస్ కుండవా కప్పుకోవడంతో గేట్లు తెరిచామని సిఎం రేవంత్ చెప్పడంతో తెల్లం కూడా అధికారికంగా కాంగ్రెస్‌లో చేరిపోతున్నట్లు పక్కా సమాచారం. పార్లమెంట్ ఎన్నికలు మొదలయ్యే నాటికి బిఆర్ఎస్ నుండి రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 30 మంది ఎంఎల్‌ఏలు చేరే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. తెల్లం చేరికను కొందరు స్వాగతిస్తున్నా... మరికొందరు పెదివి విరుస్తున్నట్లు తెలుస్తోంది.

# వేగంగా వాహనాలు నడుపుతున్న డ్రైవర్లు..!

**-భయభ్రాంతులకు గురవుతున్న గ్రామ ప్రజలు**
**-స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని వేడుకోలు**






**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై భారీ వాహనాలు అధిక వేగంతో రవాణా చేస్తున్నాయి. మండల కేంద్రంలో ఉన్నటువంటి రోడ్డు లోడ్ తక్కువ సామర్థ్యం కలిగి తక్కువ పరిమాణం కలిగి ఉన్నప్పటికీ, మండల కేంద్రం నుంచి చుట్టు పక్కల పట్టణ ప్రాంతాలకు సులువుగా ప్రయాణం కొనసాగించడానికి వీలుగా ఉన్నందువలన పెద్ద భారీ వాహనాలు అధిక వేగంతో ప్రయాణిస్తున్నాయి. ఇదిలా ఉండగా ఏ క్షణం ఏ జరుగుతుందో అన్న భయంతో గ్రామ ప్రజలు భయభ్రాంతులకు గురి అవుతున్నారు. అసలు ఈ వాహనాల వేగాన్ని ఆపేది ఎవరంటూ ప్రశ్నార్థకతను వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా వాహనాల నుంచి వస్తున్న దుమ్ము, ధూళి ఇండ్లలో చేరడం, షాపుల్లో పడటం వలన వ్యాపారస్తులు కూడా ఎన్నో రకాల ఇబ్బందులకు గురి అవుతున్నారు. అన్నపురెడ్డిపల్లి ప్రధాన రహదారి సుమారు ఒకటిన్నర కిలోమీటర్ల దూరం ఉండటం వలన, ఈ రోడ్డు పరిసర ప్రాంతాలలో పాఠశాలలు, ఇండ్లు అధిక సంఖ్యలో ఉండటంతో ఎప్పుడు ఎటువైపు నుంచి ప్రమాదం దూసుకు వస్తుందో అని భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దీనిపై దృష్టి సారించి ప్రధాన రహదారిపై కూడలి వద్ద , పాఠశాల పరిసర ప్రాంతాలలో స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేసి అతివేగంగా వస్తున్న వాహనాల నుంచి ప్రమాదాలు జరగకుండా ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

# ఊపందుకున్న కామేపల్లి కళాశాల అడ్మిషన్ల ప్రచారం






**ప్రజాపక్షం/కామేపల్లి:** పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు జరుగుతుండగా ఆ పరీక్షా కేంద్రాల వద్ద ఒక పది నిమిషాల పాటు ప్రతి రోజు తమ కళాశాలలో ప్రవేశాల గురించి ప్రచారాన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాల కామేపల్లి అధ్యాపకులు నిర్వహిస్తుండటం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం అవుతున్నది. ఒక పక్క ఇంటర్ పరీక్ష పేపర్ల మూల్యాంకనం జరుగుతూనే ఉన్నది అయినప్పటికీ తమ సబ్జెక్టులలో ఇంకా మూల్యాంకనం ప్రారంభం కానందున కళాశాలలో ప్రవేశాల పెంపుదల కోసం అందరు అధ్యాపకులు ఆఫీసు సిబ్బంది సహకారంతో ఆ సమయాన్ని కాంపెయినింగ్ కొరకు వినియోగించడం ముదావహం అని మండలంలో పలువురు అభిప్రాయ పడుతున్నారు. కళాశాల బోధన సిబ్బంది మండలంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను ప్రైవేటు ఉన్నత పాఠశాలలను ఇంతకు ముందే సందర్శించి విద్యార్థులకు తమ కళాశాల పట్ల సంగ్రహ వివరణ ఇచ్చి ఉన్నారు. కళాశాలలో ఎంపిసి, బైపిసి, సిఈసీ, హెచ్ఇసి అన్ని గ్రూపులు తెలుగు మీడియం ఇంగ్లీష్ మీడియం కోర్సులు అందుబాటులో ఉన్నాయని సిబ్బంది తెలుపుతున్నారు. అదే విధంగా గత సంవత్సరం లకావత్ తరుణ్ అనే ఎంపిసి విద్యార్థి జాతీయ స్థాయిలో విశేషంగా రాణించి ఎన్ఐటి జలందర్‌లో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ చేస్తూ ఉండటం, రాయల వినయ్ ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్ హైదరాబాద్‌లో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ కోర్సులో ఇంజనీరింగ్ చేస్తూ ఉండటం , ఆర్ట్స్ విద్యార్థులు సైతం ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో తెలంగాణ యూనివర్సిటీ క్యాంపస్, నిజాం కళాశాలలో ఇంటిగ్రేటెడ్ పిజి కోర్సులలో జాయిన్ అవ్వడం కళాశాల పనితీరుకు గీటురాయిగా అందరూ చెప్పుకుంటున్నారు.

## అంగన్వాడీ కేంద్రంలో సీమంతాలు, పోషణ పక్వాడ



**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** మండల గ్రామంలో అంబేద్కర్ నగర్ ఎస్సీ కాలనీలో ఉన్నటువంటి అంగన్వాడీ కేంద్రం నందు పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా సూపర్వైజర్ గంగాజలం ఆధ్వర్యంలో శ్రీమంతాలు అన్నప్రాసన కార్యక్రమాలను నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్య లక్ష్మి పథకం ద్వారా గర్భిణీలకు పౌష్టికాహారాన్ని అంగన్వాడీ కేంద్రాలను అందించారు. అదే విధంగా గర్భిణీలు డెలివరీ అయిన తర్వాత పిల్లలకు తప్పకుండా ముర్రిపాలు పట్టించాలని ముర్రిపాలు పిల్లలు ఆరోగ్యానికి ఎంతో శ్రేష్ఠమైనవి అని ముర్రిపాలలో పిల్లల ఎదుగుదలకు కావాలసిన ఎన్నో శక్తి వంతమైన ప్రోటీన్స్ బలమైన పోషక విలువ కలిగి ఉంటాయని, గర్భిణీలకు వివరించారు. ఈకార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు పార్వతి, పరసా కుమారి, విజయ, వెంకటలక్ష్మి , శివకుమారి, లావణ్య పాల్గొన్నారు.

## ఫిల్లింగ్ స్టేషన్‌ను సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/కామేపల్లి:** ప్రజలు ఫిల్లింగ్ స్టేషన్‌ను సద్వినియోగం చేసుకోవాలని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డిలు అన్నారు. గురువారం మండల కేంద్రమైన కామేపల్లి క్రాస్ రోడ్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ వెంకటేశ్వర ధనలక్ష్మి ఫిల్లింగ్ స్టేషన్‌ను ప్రారంభోత్సవం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు, వాహనదారులకు మరింత చేరువలో పెట్రోల్, డీజిల్ ఉండేందుకు అతి సమీపంలో బ్యాంకులు నిర్మిస్తున్నమన్నారు. ప్రజలు ఈ బ్యాంక్‌లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజల సమస్యలు తీర్చడమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమన్నారు. ఈకార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మానుకొండ రాధాకిషోర్, నిర్వాహకులు దారావత్ భాషానాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గింజల నర్సింహారెడ్డి, జిల్లా నాయకలు ఏపూరి మహేందర్ కుమార్, దమ్మలపాటి సత్యనారాయణ, రడబోతు గోపిరెడ్డి, నల్లమోతు వెంకటనర్సయ్య, పిన్ని కోటేశ్వరరావు, అజ్మీర శివ తదితరులు పాల్గొన్నారు.

## వంతెన పైనుండి దూకి వ్యక్తి ఆత్మహత్య



**ప్రజాపక్షం/భద్రాచలం :** గోదావరి నది వంతెనపై నుండి దూకి వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన గురువారం పట్టణంలో చోటు చేసుకుంది. పాల్వంచలోని వనమా కాలనీకి చెందిన తంగెళ్ల శేషంరాజ్(45) మోటార్ సైకిల్‌పై భద్రాచలం గోదావరి నది వంతెన దగ్గరకు చేరుకుని బండిని అక్కడ ఆపి గోదావరి నదిలోకి ఒక్కసారిగా దూకాడు. ఆయన దూకిన ప్రాంతంలో నీరు లేకపోవడంతో వాయివేగంతో ఇసుకలో పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని సందర్శించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## భద్రాద్రి జిల్లా స్థాయిలో ఎంసెట్ మోడల్ పరీక్ష


**ప్రజాపక్షం/బూర్గంపాడు:** గత మూడు సంవత్సరాలుగా ఎంసెట్‌లో రాష్ట్ర స్థాయి ర్యాంక్‌లతో టాప్ టెన్ కాలేజ్‌ల్లో సీట్లు సాధిస్తున్న సారపాక బ్రిలియంట్ జూనియర్ కాలేజ్ వారి ఆధ్వర్యంలో మే లో జరగబోయే ఎంసెట్ ప్రవేశ పరీక్ష వ్రాయబోవు విద్యార్థిని విద్యార్థులకు పరీక్షపై అవగాహన కల్పించుటకు బ్రిలియంట్ జూనియర్ కాలేజ్ వారి ఆధ్వర్యంలో ఈ ఎంసెట్ మోడల్ పరీక్షలను భద్రాద్రి జిల్లా స్థాయిలో ఈనెల 24వ తేదీన ఉదయం 9గంటలకు బ్రిలియంట్ కాలేజ్ సారపాక నందు నిర్వహించనున్నట్లు బ్రిలియంట్ కాలేజ్ ఛైర్మన్ బిఎన్ఆర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అవకాశాన్ని ఎంసెట్‌కు అప్లై జేసి మే లో పరీక్ష వ్రాసే విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ మోడల్ పరీక్షలో మొదటి రెండు ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులకు ఉచితంగా ఎంసెట్ కోచింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ మోడల్ పరీక్ష వ్రాయు విద్యార్థులు ఒక రోజు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోగలరన్నారు. పూర్తి వివరాలకు బ్రిలియంట్ జూనియన్ కాలేజ్ నందు సెల్ 9866283566, 9705137128 సంప్రదించాలన్నారు.

# అడుగంటిన భూగర్భజలాలు..!

-జలకళ తప్పిన చెరువులు, బావులు బోర్లు
-ఎండుతున్న యాసంగి వరి పొలాలు
-వేసవిలో మంచినీటి ఎద్దడి ఏర్పడే ప్రమాదం







ప్రజాపక్షం/తిరుమలాయపాలెం: గత కొన్ని సంవత్సరాలుగా తిరుమలాయపాలెం మండలంలో తాగు.. సాగునీరు భక్త రామదాసు ఎత్తిపోతల ద్వారా డోకా లేకుండా పుష్కలంగా ఉండేవి. కానీ ఈ సంవత్సరం నాగార్జునసాగర్‌లో అనుకున్న స్థాయిలో నీటిమట్టం లేకపోవడంతో ఉన్నకాస్త నీటిని ఆంధ్రప్రాంతానికి తరలించడంతో ఖమ్మం జిల్లాలో సాగునీరు,తాగునీరు కష్టాలు ఎదురుకాబోతున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కరువు ప్రాంతానికి నిలయమైన తిరుమలాయపాలెం మండలం స్వరాష్ట్రం ఏర్పడ్డాక సీఎం కేసీఆర్ ప్రభుత్వంలో మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో పాలేరురిజర్వాయర్ నుండి తిరుమలాయపాలెం మండలం ఇస్లావత్‌తండ వద్ద ఎస్ఆర్ఎస్‌పి కాల్వలో భక్తరామదాసు ప్రాజెక్టు ద్వారా నీటిని ఎత్తిపోసి తిరుమలాయపాలెం, కూసుమంచి, ఖమ్మం రూరల్ మండలాల్లో ఉన్న చెరువులను నింపడం ద్వారా భూగర్భజలాలు పెరిగి పుష్కలంగా బావులు బోర్లలో నీరు ఉండటంతో రైతులు రెండు పంటలను సాగు చేశారు. కానీ ఈ సంవత్సరం సాగర్‌లో నీళ్లు లేకపోవడంతో పాలేరు రిజర్వాయర్ ఇప్పటికే అడుగంటింది. తిరుమలాయపాలెం మండలంలో యాసంగి పంటలు ఎండిపోతున్నాయి. ఏప్రిల్,మే నెలలో గత సంవత్సరం నిండుకుండల్లా ఉన్న చెరువులు,బావులు ఈ సంవత్సరం మార్చినాటికే నీరు అడుగంటడంతో జలకళ తప్పాయి. రానున్న రోజుల్లో వేసవిలో సాగు,తాగునీరుకు కష్టాలు తప్పవని స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మిషన్ భగీరథ ద్వారా వరంగల్ జిల్లాతోపాటు ఖమ్మం జిల్లాలో వందల గ్రామాలకు మంచినీరు అందించవలసి ఉంది. అధికారులు ముందుచూపు చర్యలు చేపట్టకపోతే నీటి కష్టాలు తప్పవని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు వరంగల్ జిల్లాకు నీటి కష్టాలు తొలగాలంటే సీతారామ ప్రాజెక్టు పూర్తి చేసి సాగు,తాగునీరు సమస్య పరిష్కారం చూడాలని రాష్ట్రంలో నూతనంగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని స్థానిక మంత్రులను ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

## పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల పరిశీలన



ప్రజాపక్షం/కల్లూరు: కల్లూరు మండల పరిధిలోని పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతుల కల్పనను గురువారం ఎంపీడీవో చంద్రశేఖర్ పరిశీలించారు. మండలంలో 63 పోలింగ్ కేంద్రాలలో విద్యుత్, పారిశుధ్యం, మరుగుదొడ్ల, సౌకర్యం, మంచినీరు, సౌకర్యాలు కొరకు గురువారం పాఠశాలలను సందర్శించి ఆయా గ్రామాల ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక అధికారులు, కార్యదర్శులకు సలహాలు సూచనలు చేశారు. త్వరితగతిన ఎన్నికలు జరగబోతున్నందున మౌలిక వసతులు కల్పనలో త్వరగా పూర్తి చేసి అందించాలని ఆయన గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. అదే విధంగా కల్లూరు మండలం కు రూ. 1.15 కోట్లు అమ్మ ఆదర్శ పాఠశాలలకు మౌలిక వసతులు కల్పనకు నిధులు మంజూరు కావడం జరిగిందని వాటిని కూడా త్వరలో నిధులు ఖర్చు చేసి పనులు పూర్తిచేయాలని కోరారు. కల్లూరు మండల పరిధిలోని హనుమ తండా, లక్ష్మి తండా, కొర్లగూడెం, నారాయణపురం, పేరువంచ, ముగ్గు వెంకటాపురం,వాచ్య నాయక్ తండా గ్రామాలలో పరిశీలించటం తో పాటు వీధిలైట్లు, మంచినీటి పైప్లైన్లు, మంచినీరు సరఫరా విధానాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ ఏనుగు సురేష్ బాబు, పంచాయతీరాజ్ జేఈ సాంబశివరావు, కార్యదర్శులు శ్రీనివాసరావు, మురళి ముత్తారావు, పుల్లారావు రామ కృష్ణ లతోపాటు ప్రముఖులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో గాలికుంటు టీకాల శిబిరాలు



ప్రజాపక్షం/కల్లూరు: కల్లూరు మండల పరిధిలోని గ్రామాలలో గాలికుంటు టీకాల పశువైద్య శిబిరాలు మార్చి 15 నుంచి ఏప్రిల్ 10వ తేదీ వరకు జరుగుతున్నట్లు పశువైద్యాధికారిణి మమత తెలిపారు. మండలంలో మూడు నెలల దూడలనుంచి ఈ టీకాలను వేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. మండలంలో తెల్లవి 4000, నల్లవి 22000 పశువులు ఉన్నట్లు వారి పేర్కొన్నారు. గాలికుంటు టీకా వలన వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని, అనారోగ్యం నుంచి రక్షించబడుతుందని, దీంతోపాటు టీకా వేయనిచో అనారోగ్యంగా ఉంటూ వ్యాధులకు గురై మరణం సంభవిస్తుందని వివరించారు. పాడి రైతులందరూ పశువులకు వ్యాక్సిన్లు వేసి రక్షించుకోవాలని కోరారు. మండలంలో 18,000 మంది పాడి రైతులు ఉన్నారని వారందరికీ పశువైద్య సిబ్బందితోపాటు గోపాల మిత్రుల ద్వారా సమాచారం అందించి రోజువారి ప్రణాళికలతో పశు వైద్య శిబిరాలను నిర్వహించి గాలికుంటు వ్యాక్సిన్లను వేస్తున్నట్లు పేర్కొన్నారు. కావున రైతులందరూ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె పాడి రైతులను, పశు పెంపకం దారులను కోరారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది శ్రీనివాసరావు, రాధాకృష్ణ, రామకృష్ణ, ఇందిర, గోపాల మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ అసిస్టెంట్ సస్పెండ్

ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ చిత్తులూరి శ్రీనివాసరావును అసిస్టెంట్ కలెక్టర్ సత్యప్రసాద్ సస్పెండ్ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు విచారణ పూర్తి అయ్యేవరకు ఎటు పోవద్దని ఆదేశించారు. శ్రీనివాసరావుపై ఆరోపణలు వచ్చిన నేపధ్యంలో సస్పెండ్ చేశారు.

## వైరా మున్సిపాలిటీ అవినీతిపై సమగ్ర దర్యాప్తు జరపాలి : రాంబాబు

ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ అవినీతిపై సమగ్ర దర్యాప్తు జరపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. వైరా మున్సిపాలిటీ అధికారులు, పాలకవర్గం కలిసి వైరాలో వేలాది ఇంటి స్థలాలు తప్పుడు ధృవీకరణ పత్రాలను సృష్టించి వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయుటకు అవకాశం ఇచ్చారని, అదేవిధంగా ఇంటి పన్నులు రివైజ్ చేయాలని ప్రజలు ఉద్యమం చేస్తే పేద, మధ్యతరగతి ప్రజలకు ఇంటి పన్నులు భారం తక్కువ చేయకుండా ముడుపులు చెల్లించిన వారికి మాత్రమే తక్కువ చేశారని అన్నారు. ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు.

## ఉపాధి పనులను తనిఖీ చేసిన ఏపీడి



ప్రజాపక్షం/కల్లూరు: కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాలలో ఉపాధి హామీ పనులను గురువారం తనిఖీలు నిర్వహించి, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. కల్లూరు మండల పరిధిలోని చంద్రుపట్ల, రఘునాథ్ బంజర, బత్తులపల్లి, కప్పల బంధం తదితర గ్రామాలలో ఏపిడి వెంకటపతి రాజు ఉపాధి హామీ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కూలీలతో మాట్లాడుతూ ప్రతి ఉపాధి హామీ కూలికి రూ. 275/లు కూలి పడేవిధంగా అవగాహన కల్పించారు. ప్రతి గ్రామం నుంచి సుమారు 100 మంది కూలీలు కల్లూరు మండలంలో పాల్గొంటున్నారని వారందరూ తగిన కూలి పడేందుకు సిబ్బందికి, కూలీలకు అవగాహన కల్పించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ప్రతిరోజు కూలీలందరికీ రోజువారి కూలీ రూ. 275 పడేందుకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడం జరిగిందని పేర్కొన్నారు. ప్రతి కూలికి వంద రోజులు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా కూలీలు పనిచేస్తున్నారని ఎవరికైనా ఎలాంటి పనులు దొరకనిచో వెంటనే తమ సిబ్బందికి తెలియపరచాలని కోరారు. ఈ కార్యక్రమాలలో ఎంపీడీవో చంద్రశేఖర్, ఏపీవో హేమమాలిని, జేఈ పుల్లారావు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు

## మొక్కలు నాటిన గ్రీన్ భద్రాద్రి



ప్రజాపక్షం/భద్రాచలం : ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా గ్రీన్ భద్రాద్రి ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని పలు చోట్ల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అధ్యక్షులు బెల్లంకొండ రాంబాబు మాట్లాడుతూ చెట్లు భూమిపై ఉన్న అన్ని జీవరాశులకు ఆక్సిజన్ అందిస్తాయని చెప్పారు. ఔషదాల తయారీకి ఉపయోగపడతాయని, మొక్కలు పెంచడం ఆరోగ్యదాయకం అన్నారు. 2013 మార్చి 21న తొలిసారి ప్రపంచ అటవీ దినోత్సవాన్ని నిర్వహించారని తెలిపారు. ఇందులో భాగంగా ఆంజనేయ స్వామి పార్కులో మొక్కలు నాటినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విష్ణు, గోళ్లభూపతిరావు, కృష్ణార్జునరావు, కృష్ణప్రసాద్, రాజు పాల్గొన్నారు.

## ఘనంగా దాసునాయక్ 74వ వర్ధంతి




ప్రజాపక్షం/కారేపల్లి: సింగరేణి మండల హెడ్ క్వార్టర్‌లోని బంజారా కాలనీలో జాతోత్ దాసునాయక్ 74వ వర్ధంతి వేడుకలు గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎల్ఎస్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు భూక్యా రాంకోటి రాథోడ్, బానోతు రాములునాయక్, ధరావత్ రాంజీనాయక్, బాణోతు శంకర్‌నాయక్, గుగులోతు పంతులునాయక్, బానోతు శంకర్‌నాయక్, బానోతు భావ్‌సింగ్ నాయక్, మూడ్ చిన్న మల్లునాయక్ తదితరులు పాల్గొన్నారు.

## వైరా మున్సిపాలిటీ పన్నుల వసూళ్లు

# వందశాతం పూర్తయ్యేనా..!?




-టార్గెట్ రూ.3కోట్ల 9లక్షలు
-ఇప్పటివరకు రూ.1కోటి 50లక్షలు వసూలు
-ఇంటి యజమానులు పట్ల దురుసుగా ప్రవర్తన?
-ప్రజలు పట్ల స్నేహపూర్వకంగా ఉండాలి : కమీషనర్ వేణు

ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీలో పన్నుల వసూలు ఈ నెల31 వరకు ముగియనుంది. మున్సిపాలిటీకి రూ.3కోట్ల9లక్షలు రూపాయలు వసూలు చేయాల్సి ఉండగా ఇప్పటివరకు 50% రూ.1కోటి50లక్షలు వసూలు చేశారు. ఇంకా 9 రోజులు మిగిలి ఉంది. ఈ 9 రోజుల్లో రూ.1కోటి60లక్షలు వసూలు చేస్తారా? మున్సిపాలిటీ ఆదాయం టార్గెట్‌ను పూర్తి చేస్తారా అనేది ఇప్పుడు ప్రశ్నార్ధకంగా మారింది. ఎందుకంటే మున్సిపాలిటీలో 13 మిషన్‌ల ద్వారా టాక్స్ కట్టించుకునేందుకు విధి నిర్వహణ కొనసాగిస్తున్నారు. వాస్తవానికి ప్రతి వార్డు ఆఫీసర్ బిల్లులు కట్టించుకోవడంలో కీలకపాత్ర పోషించాల్సి ఉంది. అయితే ఇక్కడ వార్డు ఆఫీసర్లు కొంతమంది విధినిర్వహణలో నిర్లక్ష్యంగా వహించడంతో టార్గెట్లు పూర్తి కావట్లేదని వాదనను వినిపిస్తున్నాయి. ఎందుకంటే వార్డు అధికారులు కొంతమంది సమయపాలన పాటించకుండా వారి అసిస్టెంట్లను వార్డులో పన్నులు వసూళ్ళకు పంపిస్తున్నారు. దీంతో పన్నులు వసూలులో నిర్లక్ష్యం నీలి నీడలో వెంటాడుతుందని తెలుస్తుంది. అసలు ఇంటి పన్నులు వసూలు చేయడంలో కొంతమంది వార్డు అధికారులు ఇంటి యజమానుల పట్ల నిర్లక్ష్యంగా దురుసుగా ప్రవర్తిస్తున్నారు నే వాదనలు లేకపోలేదు. ఎందుకంటే వారితో కొంతమంది అసభ్యంగా మాట్లాడుతూ బెదిరిస్తున్నారని ఆరోపణలు లేకపోలేదు. ఒక ఇంటి వద్దకు పన్నులు వసూలు చేయడానికి పోవాల్సిన అధికారులు రకరకాల రూపంలో పోయి ఇంటి యజమానుల పట్ల వారి ప్రవర్తన సరిగా లేదని ఆరోపణలు లేకపోలేదు. ఇప్పటికే వైరా మున్సిపాల్ కమీషనర్ వేణు ఆఫీస్ వ్యవహారాల్లో ఎవరైనా సమయపాలన పాటించకపోయినా వారిపై చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. అయితే అదేవిధంగా మున్సిపాల్ కార్యాలయానికి వచ్చే వారి పట్ల మర్యాదగా స్నేహపూర్వకంగా మెదగాలని, పన్నులు వసూలు చేసేటప్పుడు ఇంటి యజమానులు పట్ల దురుసుగా ప్రవర్తించవద్దని, ఎవరైనా దురుసుగా ప్రవర్తిస్తే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

**పూర్తిస్థాయిలో పన్నులు వసూలు చేస్తాం : మున్సిపాల్ కమీషనర్ వేణు**

వైరా మున్సిపాలిటీలో పూర్తిస్థాయిలో పన్నులు వసూలు చేయడం జరుగుతుందని, ఈ నెల31 వరకు పూర్తి చేస్తామని, ప్రతి వార్డులో వార్డు ఆఫీసర్ పన్నుల వసూళ్ళలో ముందుకు పోవాలని మిగిలిన 10 రోజులు పన్ను వసూలు ఎంతో కీలకమని ప్రత్యేకంగా పన్ను వసూలు చేసేందుకు మరింత చర్యలు తీసుకుంటామని కమీషనర్ వేణు తెలిపారు.

## అధైర్య పడకండి.. అండగా ఉంటాం



- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సతీమణి మాధురి
- ఖమ్మం రూరల్‌లో విస్తృత పర్యటన
-పలు కుటుంబాలకు పరామర్శ

ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ : ఏ కష్టమొచ్చినా ఆదుకోవటానికి మీ పొంగులేటి శీనన్న అండగా ఉంటారని, అధైర్య పడవద్దంటూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సతీమణి మాధురి ప్రజలకు భరోసానిచ్చారు. గురువారం ఖమ్మం రూరల్ మండలంలోని గుర్రాలపాడు,తెల్దారుపల్లి,మద్దులపల్లి, పొన్నేకల్,తల్లంపాడు,కొండాపురం, చింతపల్లి, ఆరెకోడుతండా,ఆరెకోడు, ఆరెంపుల, బారుగూడెం, గొల్లగూడెం తదితర గ్రామాలలో విస్తృతస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో ఇటీవల మృతి చెందిన పలు కుటుంబాలను పరామర్శించి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి ఓదార్చారు. అనంతరం మాట్లాడారు...మీ గుండెల్లో పెట్టుకుని గెలిపించిన శీనన్న మీకష్టసుఖాల్లో ఎల్లప్పుడూ అండగా ఉంటారన్నారు. మీరు ఎంత టిప్రేమనైతే చూపించారో అంతకు పదిరెట్ల ప్రేమఅభిమానాలు శీనన్న యాదిలో ఉన్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ పక్షాన బాధిత కుటుంబాలకు తప్పకుండా న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కళ్లెం వెంకటరెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు మద్దిమల్లారెడ్డి, మద్ది కిషోర్‌రెడ్డి, బండి జగదీష్,జిల్లా యూత్ నాయకులు తమ్మినేని నవీన్, మండల నాయకులు మద్ది వీరారెడ్డి, ముత్యం కృష్ణారావు, అజ్మీర అశోక్, తిప్పిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, వంగూరి రవి, ఏటుకూరి సుధాకర్, మెండెం వెంకటేష్‌యాదవ్, నల్లపునేని కౌశిక్, అంజయ్య, గురునారాయణ తదితరులు పాల్గొన్నారు.

## బోన్ క్యాన్సర్‌కు చికిత్స ఉంది..




-ఏ క్యాన్సరైనా ప్రాణాలను కాపాడుకోవచ్చు
-క్యాన్సర్ స్పెషలిస్టు డాక్టర్ హరీష్ కంచర్ల

ప్రజాపక్షం/ ఖమ్మం : బోన్ క్యాన్సర్‌కు చికిత్స ఉందని తొలి దశలో నిర్ధారణ చేస్తే ఏ క్యాన్సరైనా బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ ద్వారా 90 శాతం విజయవంతమవుతాయని ప్రముఖ క్యాన్సర్ స్పెషలిస్ట్, యశోద ఆసుపత్రి వైద్యులు హరీష్ కంచర్ల తెలిపారు. గురువారం ఖమ్మం ప్రెస్ క్లబ్‌లో బోన్ క్యాన్సర్‌పై విజయం సాధించిన వారితో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ల గురించి అవగాహన కల్పించడానికి క్యాన్సర్ పై విజయం సాధించిన వారిని ప్రేరణగా చూపాలన్నారు. క్యాన్సర్ నుంచి కోలుకున్న తర్వాత సాధారణ జీవనం గడప వచ్చునని ఆయన తెలిపారు. బోన్ క్యాన్సర్ అనేది టీనేజ్ పిల్లల్లో ఎక్కువగా వస్తుందని ఎముక మజ్జ భాగాన్ని ప్రభావితం చేసే ఒక రకమైన క్యాన్సర్ అని ఇందులో పలు రకాలుంటాయన్నారు. క్యాన్సర్‌ను ముందుగా గుర్తించడం వల్ల పూర్తిగా నయమయ్యే అవకాశాలు గణనీయంగా ఉన్నాయన్నారు. ప్రస్తుత తరుణంలో క్యాన్సర్లు ఆధునిక కిమో థెరపి, ఇమ్యూనో థెరపి, టార్గెటెడ్ థెరపి, బోన్‌మ్యారో, ట్రాన్స్‌ప్లాంట్ వంటి ఆధునిక చికిత్సలతో నయం చేయవచ్చునన్నారు. ప్రస్తుత ఆధునిక పద్ధతులు క్యాన్సర్ కణాలను ఎంపిక చేసి చంపుతాయని ఆరోగ్యవంతమైన కణాలకు ఎటువంటి ఇబ్బంది ఉండదని డాక్టర్ హరీష్ తెలిపారు. ఖమ్మం నగరానికి చెందిన ఎనిమిదేళ్ల చిన్నారి రెండేళ్ల క్రితం వైద్యం పొంది ఇప్పుడు సంతోషంగా జీవిస్తుందన్నారు. ఆ పాపకు రేడియేషన్ ట్రీట్‌మెంట్ ఇవ్వడం జరిగిందన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా ఏ క్యాన్సర్ నుండైనా ఉపశమనం పొందవచ్చునన్నారు. ఈ సమావేశంలో యశోద ఆసుపత్రి మేనేజర్ శ్రీనాథ్, పలువురు క్యాన్సర్ విజేతలు పాల్గొన్నారు.

## పది పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డా.ప్రియాంక ఆలా గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పాల్వంచ పట్టణంలోని కేటిపిఎస్ డివివి మోడల్ స్కూల్‌కు వెళ్లిన ఆమె పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. పరీక్షకు హాజరైన విద్యార్థులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. మాస్ కాపీయింగ్‌కు తావు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. పొరపాట్లు దొర్లితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం విద్యార్థులకు కల్పించే మౌళిక సదుపాయాలపై ఆరా తీశారు. పరీక్షాకేంద్రంలో మంచినీటి సదుపాయంతో పాటు అన్నిరకాల సదుపాయాలు ఉండాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని పోలీసులను ఆదేశించారు. ప్రతీ ఒక్కరినీ క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే పరీక్ష హాల్లోనికి అనుమతించాలన్నారు. సిసి కెమెరాల పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలని, సిసి కెమెరాలను పరిశీలించారు. కలెక్టర్ వెంట కొత్తగూడెం ఆర్‌డిఓ మధు, పాల్వంచ తహశిల్దార్ డి వివేక్, పాల్వంచ మున్సిపల్ కమీషనర్ స్వామి తదితరులున్నారు.

## అవాంఛనీయ సంఘటనలకు తావివ్వొద్దు




ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పి రోహిత్ రాజ్ అన్నారు. గురువారం ఆయన ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ఏలూరి జిల్లా పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫిరెన్స్ ద్వారా నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయనతో పాటు ఏలూరు జిల్లా ఎస్పి మేరి మేరి ప్రశాంతి పాల్గొన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పటిష్టమైన చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. అక్రమంగా నగదు, మద్యం సరఫరాను నిరోదించేందుకు 12 ఇంటర్ స్టేట్ చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చెక్‌పోస్టుల వద్ద విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి వాహన తనిఖీలు నిర్వహించాలన్నారు. ఎన్నికల సంఘం అధికారులు చేపడుతున్నఅన్ని చర్యలను నిశితంగా పరిశీస్తుందని సూచించారు. ఈ వీడియో కాన్ఫిరెన్స్‌లో పాల్వంచ డిఎస్‌పి, జంగారెడ్డి గూడెం డిఎస్‌పి, పోలవరం డిఎస్‌పి, సరిహద్దు పోలీస్ స్టేషన్ల సిఐలు, ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

## రామయ్యకు నిత్యకళ్యాణం



ప్రజాపక్షం/భద్రాచలం : శ్రీ సీతారామ చంద్ర స్వామివారి ఆలయంలో రామయ్యకు గురువారం నిత్యకళ్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. తెల్లవారుఝామున పావన గోదావరి నదీ తీరం నుండి మేళ తాళాల నడుమ పవిత్ర నదీ జలాలను తీర్ధ బిందెల్లో తీసుకొచ్చి ఆలయాన్ని సంప్రోక్షణ చేశారు. అనంతరం స్వామికి సుప్రభాత సేవ నిర్వహించి బాలభోగం సమర్పించారు. భక్తులకు సర్వదర్శనం కల్పించి తీర్ధ ప్రసాదాలు అందజేశారు. గర్భగుడిలోని ఉత్సవ మూర్తులను అలంకరించి ప్రత్యేక పల్లకీలో బేడా మండపానికి తీడుకొచ్చారు. అప్పటికే సిద్ధం చేసిన పెళ్లి పీటలపై సీతారాములను ఆశీనులను చేసి జీలకర్ర బెల్లం మిశ్రమాన్ని శిరస్సులపై ఉంచి పెళ్లి తంతు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు సీతమ్మకు, రామయ్యకు కట్న కానుకలు సమర్పించారు. నిత్యకళ్యాణానికి వచ్చిన భక్తులు ఆలయం తరుపున తీర్ధ ప్రసాదాలు అందజేశారు.

## బార్ బరిలో నిలిచింది వీరే..

ప్రజాపక్షం/ ఖమ్మం లీగల్ : 2024 25 సంవత్సరానికి ఖమ్మం బార్ అసోసియేషన్ ఎన్నికలకు సంబంధించి గురువారం నామినేషన్ ప్రక్రియ ముగిసింది. అధ్యక్ష స్థానానికి ముగ్గురు పోటీపడుతున్నట్లు ఎన్నికల అధికారి మారగాని శ్రీనివాసరావు తెలిపారు. కన్నెబోయిన నాగేశ్వరరావు, నేరళ్ల శ్రీనివాసరావు, చిలుకూరి స్వర్ణకుమారి లు పోటీ పడుతున్నారని ఆయన తెలిపారు. ప్రధాన కార్యదర్శి పదవికి కొండపల్లి శ్రీనివాస్ చౌదరి, చింతనిప్పు వెంకటేశ్వరరావు, గ్రంథాలయ కార్యదర్శి పదవికి కన్నెగంటి గోపి, దేవరకొండ కళ్యాణి పోటీలో ఉన్నారని శ్రీనివాసరావు తెలిపారు. మిగిలిన పదవులకు ఒక్కొక్క నామినేషన్ దాఖలు కావడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. ఉపాధ్యక్షులుగా కె. ఉపేందర్‌రెడ్డి, సహాయ కార్యదర్శి కందే వెంకటేశ్వరరావు, కోశాధికారిగా యజ్ఞాని శ్రీనివాసరావు, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శిగా అలవాల యుగంధర్‌రావు, మహిళా ప్రతినిధిగా తన్నీరు లలిత ఎన్నికైనట్లు తెలిపారు. ఎన్నికల ప్రధాన అధికారిగా మారగాని శ్రీనివాసరావు, సహాయ అధికారులుగా కూరపాటి శేఖర్ రాజు, రాయల పావెల్ వ్యవహరిస్తున్నారు.